# డాలర్ కథ

న్యూఢిల్లీలో మొదటి పెద్దమనిషి కనబడి అన్నాడు. 'చూశారా, మీరు కుక్కనివెంట బెట్టుకుని వెళ్తున్నారు.'

బ్రాహ్మడు ఆశ్చర్యపోయి వెనక్కి తిరిగిచూశాడు. తను పట్టుకున్నది ముమ్మూర్తులా నల్లని మేక. అచ్చంగా అమాయకంగా అంతంత కళ్లతో చూస్తున్నది. చక్కా మే మే అని అరుస్తున్నది.

మేక అంటే మేకల్లాంటి సాధువులయిన జనం. అధికారాలూ, ఆడంబరాలూ తమకి కావాలని అడగని జనం. ఆకలి తప్పించి ఏమీ ఎరుగని జనం. ఆకుల్తో అలుమల్తో తృప్తి చెందే అలగా జనం. కారులు కావాలని, మేడలు కట్టాలని కలల జోలికికూడాపోని కార్మిక కర్షకజనం. పెద్దపెద్ద చదువులు చదవాలనీ గొప్పగొప్ప ఉద్యోగాలు కావాలని గాని ఆశలు పెంచుకోని మామూలు జనం. వడ్డీకింద దేశంలోని సంపదనంతా సంపన్న దేశాలకి ముడుపు కడ్తున్నా, ఆ తెచ్చిన అప్పుల్తో నిర్మించిన కర్మాగారాలు వందలకోలది కోట్లు నష్టపోతున్నా, నాయకులూ ఉద్యోగులూ ఇంకా వర్తకులూ తమకళ్లెదుటే దేశాన్ని దోచుకుంటున్నా ఇదేమని అడగని అమాయకులైన జనం.

పదవులు కావాలనిగానీ, విమానాల్లో తిరగాలనిగానీ, నక్షత్రాల హోటళ్లల్లో ఉండాలనిగానీ తెలీని జనం. వాళ్లుంటున్న గ్రామాలు విడిచిపెట్టి ఢిల్లీలోనో, డార్జిలింగ్‌లోనో బ్రతకాలన్న ఆశ వారికి లేనేలేదు. నేను చాలా గట్టిగా ధైర్యంగా చెప్పగలను. వాళ్లకి కడుపునిండా గంజి, చేతినిండా పని, కళ్లనిండా నిద్ర, ఉండటానికి ఒక ఇల్లూ తప్పించి ఇంకేమీ అక్కర్లేదు.

న్యూఢిల్లీలో మన పెద్దమనిషి బాబుగారు తర్వాత తన అనుచరులను చూసి ఏమన్నారంటే 'దాన్ని పుచ్చుకుక్క అను. పిచ్చికుక్క అను. నాలుగు బాదు. తర్వాత - బాదితే అది అరుస్తుంది కదా. కరవబోతుంది కదా. అప్పుడు దాన్ని కాల్చేయి. పిచ్చికుక్కని చంపి వీధుల్లో నడిచే పిల్లలని రక్షించినందుకు నిన్ను సిటిజన్స్ అంతా పొగుడ్తారు. నీ ఫొటో పేపర్లో పడుతుంది.అట్లా కొన్ని మంచి పనులు చేశావో నీ పేరు ఎమెల్సీ పదవిలో పడుతుంది. నీకూ, నీ చేతిలోని గన్‌కీ ఎప్పుడూ బలముంటుంది. నిన్ను రక్షించటానికి నీవు కాకితో కబురంపినా చాలు. వాసుల్లో వాలటానికి పోలీసు దళాలెప్పుడూ సిద్ధంగా

ఉంటారు. మరి నీ పని కానీయ్. కాల్ హిమ్ నక్సల్ ఎండ్ ఫినిష్ హిమ్.'

బ్రాహ్మడు మేకను పట్టుకుని వస్తున్నాడు. దార్లో దినపత్రిక సంపాదకుడు చూసి 'నల్లకుక్కను తమరు తీసుకెళ్తున్నారు! ఇదేం విచిత్రం! తమని తమ మంచితనాన్ని చూసి ఎవరో మోసం చేశారు. మీలాంటి మంచి వాళ్లని, గంగిగోవుల్లాంటి వాళ్లని ఏ దుర్మార్గుడో మోసంచేసి - ఈ కుక్కని మీ చేతుల్లో పెట్టాడు. ఎంత పాపం! ఎంత పాపం!' అని ఆశ్చర్యపోయాడు. గోబెల్స్ వారసుడైన ఆ సంపాదకుడు.

బ్రాహ్మడికి ఆశ్చర్యమయింది. తన మేకని చూసుకున్నాడు. పౌరోహిత్యం చేసినందుకు డబ్బు చేతుల్లో పెడ్తుంటే వద్దని ఇంటిదగ్గర పిల్లవాడికి పాలు సరిపోవటం లేదని చూలుతో ఉన్న మేకని అడిగి తెచ్చుకున్నాడు. దాని పొదుగు నిండుగా ఉంది. ఐదుమాసాలు నిండినట్టున్నాయి. వారంలోనో పదిలోనో ఈనుతుంది. కాని దార్లో కలసిన సంపాదకుడు కుక్కను పట్టుకెళ్తున్నారంటున్నాడు. న్యూఢిల్లీలో ఆ పెద్దమనిషి కూడా అట్లానే అన్నాడు.

వినిపించుకోలేదు బ్రాహ్మడు. తన కళ్లని నమ్మాడు. నడుస్తున్నాడు.

మందిరం పందిరి కింద నుంచున్న మఠాధిపతిగారు చూసి 'నువ్వు చూస్తే నుదుట విబూది దాల్చిన నిష్కామ కర్మయోగివి. మునులూ రుషులూ జన్మించిన పుణ్యభూమి మనది. కుక్కను ముట్టుకుంటే గంగలో మూడుసార్లు మునగాల్సిన సంప్రదాయం మనది. ఎట్లా అది కుక్క అని తెలిసికూడా దాన్ని పట్టుకున్నావు? గత జన్మలో ఏ కర్మ ఫలితమో.... ఇకనన్నా దాన్ని వదిలించుకుని తీర్థయాత్రలు చెయ్యి..... రామనామం స్మరించు.' అన్నారు.

బ్రాహ్మడు మళ్లీ వెనక్కి తిరిగి తను తెచ్చుకున్న మేకను చూసుకున్నాడు. కుక్కకు కొమ్ములుండవు. మరి కొమ్ములు కనిపిస్తున్నాయి. కాళ్లకి గిట్టలుకూడా ఉన్నాయి. అయినా చూసిన మఠాధిపతి స్వాములవారు కుక్కే అంటున్నారు.

ఇరవైయేళ్ల క్రితం ఇంగ్లీషు వాళ్ల గొడుగు పట్టిన వాళ్లు ఇప్పుడు సెక్రటరీలయి, డైరెక్టర్లయి, తల్లిదగ్గర పాలుతాగుతూ నేర్చుకున్న తీయని భాషని మరచిపోయి, కలం నిండావిషం పోసి ఒక్కొక్క అక్షరంని ఒక్కొక్కళ్ల నోళ్లలో మందు అనీ, చట్టము అనీ, ప్రజాశ్రేయస్సనీ చెప్పి పిండుతున్న వాళ్ల ఏజెంట్ నాలుగో చోట ప్రత్యక్షమై 'పురోహితులు వారా. ఇదేమిటి? కుక్కను తమరు లాక్కెళ్లడమేమిటి? దీన్ని ఇలా పట్టుకునే ఊళ్లోకి వెళుతున్నారా? కులం నుంచి వెలేస్తారు జాగ్రత్త. ఇంక మిమ్మల్ని పలకరించరు' అని హెచ్చరించాడు.

'జాగ్రత్త?' అన్నాడు.

బ్రాహ్మడు వెనక్కి చూశాడు. అక్కడ పొదలో పచ్చి ఆకులు కనబడితే ఆవేపు

లాగుతున్నది. అందుకుని ఆకులు తింటున్నది. కుక్కలు ఆకులు తినవు. అయినా నమ్మకం చాల్లేదు. ఒకరా ఇద్దరా? నలుగురు పెద్దమనుషులు చెప్తున్నారు. తన కళ్లకి ఏదో పొర కప్పేసినట్టున్నది. తన నెవరో నిజంగానే మోసం చేసినట్టున్నారు. అది నిజంగా కుక్కే అయుండాలి. లేకపోతే ఇందరు ఇన్ని విధాల చెప్తారా?

బ్రాహ్మడు మేకని విడిచిపెట్టేశాడు.

మేక పొదమీదపడి ఆకులు తింటుంటే బ్రాహ్మడు కనుమరుగయిన తర్వాత నలుగురు దొంగలూ వచ్చి దాని చుట్టూచేరి ఆమేకను పట్టుకున్నారు. ఆ రాత్రే దాన్ని చంపి అప్పు తెచ్చిన దేశాలకు డాలర్ల రుణానికి ఆ మాంసాన్ని వడ్డీ కింద జమ కట్టారు.

*

*సంవేదన, 1967*